బ్రహ్మోత్సవాలలో నేడు :
ఉదయం: 8-10మధ్య కల్పవృక్ష వాహనం
మధ్యాహ్నం: 1-3మధ్య స్నపన తిరుమంజనం
రాత్రి: 7-9మధ్య సర్వభూపాల వాహనం



కాళీయమర్ధనుడిగా మలయప్ప కటాక్షం

● పెరిగిన భక్తుల రద్దీ







బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శుక్రవారం ఉదయం సింహవాహనంపై యోగనరసింహుడిగా దర్శనమిచ్చిన మలయప్ప. రాత్రి ముత్యపుపందిరిలో కాళీయమర్ధనుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. తెల్లటి ముత్యాల నడుమ విశేష అలంకరణలో శ్రీభూ సమేతుడై గ్యాలరీల్లో ఉన్న భక్తులను అనుగ్రహించారు. ఉదయం, రాత్రి వాహన సేవల్లో భక్తులు అధికంగా పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఇక, బుధ, గురువారాల్లో తిరుమలలో భక్తుల రద్దీ చాలా సాధారణంగా కనిపించింది. శుక్రవారం మాత్రం రద్దీ పెరిగింది. ఉదయం వాహన సేవలోనే భక్తులు గ్యాలరీల నిండుగా కనిపించారు. రాత్రి వాహన సేవకు రెట్టింపయ్యారు. వాతావరణం చల్లగా ఉండడంతో టీటీడీ అందజేసిన అన్నప్రసాదాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోనే కూర్చుండిపోయారు. కళాబృందాలు కూడా ఉదయం కంటే రాత్రి వాహనసేవలో మరింత ఉత్సాహంతో ప్రదర్శనలిచ్చాయి. పెరటాసి రెండవ శనివారంతో పాటు ఆదివారం గరుడసేవ కావడంతో రద్దీ క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి రద్దీ మరింత పెరిగే అవకాశముందని టీటీడీ అంచనా వేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చిత్తూరులో నేడు '2కే రన్'

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సూచనలతో శనివారం చిత్తూరులో రన్ ఫర్ టూరిజం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు గాంధీవిగ్రహం నుంచి మెసానికల్ మైదానం వరకు ఈ పరుగు ఉంటుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తారని పేర్కొన్నారు.

హంద్రీ-నీవా కాలువను పరిశీలించిన కలెక్టర్



తుమ్మిసీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

శాంతిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలోని తుమ్మిసీ వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువను కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఉదయ్‌కుమార్ తుమ్మిసీ చెరువుకు హంద్రీ-నీవా కాలువ నుంచి నీరు రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. హెచ్ఎన్ఎస్ అధికారులను పిలిపించి.. శాంతిపురంలోని కొన్ని చెరువులకు హంద్రీ-నీవా కాలువ నుంచి నీరు చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్ నేతలు ఆంజినేయరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, బాలకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు సూచన

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సప్తగిరి గ్రామీణ బ్యాంకును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చడంతో ఐఎఫ్ఎస్‌సీ కోడ్, అకౌంట్ నెంబర్లను మార్చారని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు నాగరాజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకుల ద్వారా పింఛన్లు పొందుతున్న వారు కొత్త ఐఎఫ్ఎస్‌సీ కోడ్, అకౌంట్ నెంబరును సబ్ ట్రెజరీ అధికారికి ఇవ్వాలన్నారు. ఈ వివరాలను ఇవ్వనివారి పింఛన్ బిల్లులు తయారు చేయడం కష్టమవుతోందన్నారు. ఈ విషయాన్ని పింఛన్‌దారులు గుర్తించాలని సూచించారు.

తగ్గిన శ్రీవారి హుండీ ఆదాయం

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం బుధవారం ధ్వజారోహణం రోజున బాగా తగ్గింది. ఉపరాష్ట్రపతి, సీఎం సహా వీఐపీలు చాలా మంది తిరుమలలో ఉన్న ఆరోజు భక్తుల సంఖ్య 58వేలు మాత్రమే. గురువారం పరకామణి లెక్కింపులో రూ.1.74 కోట్లు లభించింది. గత రెండేళ్లలో ఒకేరోజు ఇంత తక్కువ హుండీ ఆదాయం ఇదే మొదటిది.

డీసీసీబీలో 'లెక్క' తేలుస్తున్నారు!

రూ.21.12 కోట్లు దుర్వినియోగమైనట్లు గుర్తింపు

వచ్చేనెల 6వ తేదీనుంచి రెండో దశ విచారణ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) కార్యకలాపాలు అడ్డగోలుగా సాగాయి. బ్యాంకు పాలకవర్గం నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. వైసీపీ వర్గీయులకు నిబంధనలకు విరుద్ధంగా రుణాలివ్వడం, నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల ప్రమోషన్లలో అక్రమాలు.. ఇలా ఏ అంశంలో చూసినా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించలేదు. ఎట్టకేలకు డీఆర్వో మోహన్‌కుమార్ నిర్వహించిన సహకార చట్టం సెక్షన్-51 విచారణలో నాటి పాపాల పుట్ట బద్ధలైంది. ఒక్కొక్కటిగా 'లెక్క' తేలుస్తున్నారు.

సర్‌చార్జి విచారణ అధికారిగా వెంకటరమణ

బ్యాంకు అక్రమాలపై సెక్షన్-51 విచారణతో తొలి దశ పూర్తయ్యింది. 48 మంది బ్యాంకు ఉద్యోగులు బలయ్యారు. మొత్తం 21.12 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఇక రెండో దశ విచారణ ప్రారంభం కాబోతుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో సహకార చట్టం 1964 మేర 60-1 సెక్షన్ కింద బ్యాంకు అవినీతి, అక్రమాల్లో బాధ్యులైన 120 మందిపై విచారణకు ఆదేశించారు. సర్‌చార్జి విచారణ అధికారిగా సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ (డీఆర్) ఎం.వెంకటరమణను నియమించారు. 2026 జనవరి నెలాఖరులోగా బాధ్యులందరిపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.



వెంకటరమణ

నోటీసుల జారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం

సెక్షన్-51 విచారణలో గుర్తించిన 120 మంది డిఫాల్టర్లకు సర్‌చార్జి నోటీసులు జారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చేనెల 6వ తేదీనుంచి చిత్తూరు కేంద్రంలోని డీఆర్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని 15 రోజులకు ముందుగా జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. రోజుకు ఐదుగురు చొప్పున 'సహకార కోర్టులో' విచారణ చేయనున్నారు. ఇందులో బ్యాంకు అప్పటి పర్సన్ ఇన్‌చార్జి పాలకవర్గం చైర్‌పర్సన్, డైరెక్టర్లతోపాటు మొన్న సస్పెండైన 48 మంది బ్యాంకు ఉద్యోగులు, ఉమ్మడి జిల్లాలోని సింగిల్‌విండోల సీఈవోలు, ఉద్యోగులు, అక్రమంగా రుణాలు పొందిన లబ్ధిదారులు ఉన్నారు.



రెండో దశ విచారణ జరగనున్నది ఈ కార్యాలయంలోనే..


ఆస్తుల 'కండీషనల్ అటాచ్‌మెంట్ బ్యాంకు ఖాతాల స్తంభనపై త్వరలో ఆదేశాలు

సెక్షన్-51 విచారణలో డిఫాల్టర్లుగా గుర్తించిన 120 మందికి సంబంధించిన ఆస్తుల 'కండీషనల్ అటాచ్‌మెంట్' కోసం ముందస్తుగా ఆయా ప్రాంతాల సబ్‌రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్ ద్వారా అధికారిక ఆదేశాలు త్వరలో విడుదల కానున్నట్లు సమాచారం. వారి పేరిట వివిధ బ్యాంకుల్లోని ఖాతాలను సైతం స్తంభింపజేయనున్నారు.

పంటలపై ఆగని 'గజ'దాడులు

కల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల మంద దాడులు ఆగడం లేదు. గురువారం రాత్రి కూడా దేవళంపేట, పాళెం పంచాయతీల్లోని పంటలకు తీవ్ర నష్టం కల్గించాయి. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన తొమ్మిది ఏనుగుల మంద పాళెం మీదుగా హంద్రీ-నీవా కాలువను దాటుకుని కుమ్మరిపల్లె వద్దకు చేరుకున్నాయి. మధు, విజయ్‌కుమార్‌కు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. గమనించిన అటవీశాఖ సిబ్బంది టపాకాయలు పేల్చడంతో ఏనుగులు కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకుని కొంగరవారిపల్లె సమీపానికి చేరుకున్నాయి. కమలనాథనాయుడు, దశరథనాయుడికి చెందిన మామిడిచెట్లు, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. ఇనుపగేటును విరిచేసిన ఏనుగుల మంద అక్కడినుంచి బాలిరెడ్డిగారిపల్లె వద్దకు చేరుకున్నాయి. అక్కడ పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేసి.. అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. గుట్టమీదపల్లె మీదుగా హంద్రీ-నీవా కాలువ గట్టున అడవిలోకి చేరుకున్నాయి. శుక్రవారం పగలంతా ఏనుగుల గుంపు అడవిలోని సూరప్పచెరువు సమీపంలో సంచరించినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

రాత్రంతా గున్నఏనుగుల ఘీంకారాలే : అడవిలో నుంచి ఆరు గున్న ఏనుగులు, మూడు పెద్ద ఏనుగులు మందగా కుమ్మరిపల్లె వద్దకు రాగా అక్కడ పేల్చిన టపాకాయలశబ్దాలతో చెల్లాచెదురయ్యాయి. గున్న ఏనుగులు ఓవైపు, పెద్దఏనుగుల మరోవైపు వెళ్లాయి. ఈ క్రమంలో గున్న ఏనుగుల ఘీంకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కుమ్మపల్లె, వడ్డిపల్లి, తుడుంవారిపల్లెవాసులు భయాందోళనకు గురయ్యారు.





ధ్వంసమైన మామిడిచెట్లు - రాతికూసాలను విరిచేసిన ఏనుగులు

గ్రామ సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

వెదురుకుప్పం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో ఓ గ్రామ సచివాలయ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర కారణాలతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మాంబేడు గ్రామ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంటు పి.వెంకటసుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. పుంగనూరులో 5.2, గంగవరంలో 2.4, పలమనేరులో 6.2, బైరెడ్డిపల్లెలో 2.2, శాంతిపురంలో 2, కుప్పంలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

అధ్యక్షా..

ఐటీఐకి కొత్త భవనాన్ని నిర్మించండి




వెదురుకుప్పంలో ఐటీఐకి 2013లో సుమారు ఐదెకరాల భూమి ఇచ్చారు. భవన నిర్మాణానికి రూ.3కోట్లను కేటాయించారు. భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. 2019-2020లో నిర్మాణం కోసం రూ.1.93లక్షలు అడిగారు. ఆ నిధులూ రాలేదు. ఆ తర్వాత రూ.5.2 కోట్లకు టెండర్ పిలిచారు. అదీ ఆగిపోయింది. మాది ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఇక్కడ అందరూ పేదల పిల్లలే చదువుకుంటున్నారు. ఇక్కడ ఆరు ట్రేడ్లు, 12 యూనిట్లు ఉన్నాయి. ఇందులో సుమారు 264 సీట్లు. ఫుల్ స్ట్రెంత్‌లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో వీరంతా ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వెదురుకుప్పంలోని ఐటీఐకి కొత్త భవనాన్ని నిర్మించాలని నేను మీ ద్వారా మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా.

- డాక్టర్ థామస్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే

ధనలక్ష్మీదేవిగా బోయకొండ గంగమ్మ





ధనలక్ష్మీదేవి అలంకరణలో బోయకొండ గంగమ్మ - చిత్తూరు గిరింపేటలో కాత్యాయనీ దేవి అలంకారంలో దుర్గమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా బోయకొండ గంగమ్మ శుక్రవారం ధనలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో కనకధార అక్షయపాత్ర.. అందులో రూ.10, 20, 50, 100 నోట్లు.. మరో రెండు చేతుల్లో కమలాలు, మెడలో బంగారు, ఐదు రూపాయల కాయిన్లు, నెమలి పింఛాల హారాలతో గంగమ్మను అలంకరించారు. డార్మిటరీ హాల్లో కలశ స్థాపన చేసి ఉత్సవమూర్తిని ఆశీనులను చేశారు. గణపతి, నవగ్రహ, దుర్గ, చండీ, మృత్యుంజయేశ్వర, ధనలక్ష్మీదేవి హోమాలు నిర్వహించారు. ఉభయదారులకు అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను ఆలయ ఈవో ఏకాంబరం అందజేశారు.

ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు వేతనాల పెంపు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ కార్మికులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కనీస వేతనాలను పెంచినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కేటగిరీల కింద విభజించి.. వేతనాలను పెంచినట్లు వివరించారు.

కనకదుర్గమ్మకు వరసిద్ధుడి పట్టువస్త్రాలు



కనకదుర్గమ్మ ఆలయాధికారులకు పట్టు వస్త్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, చైర్మన్ మణినాయుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మకు శుక్రవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడి ఆలయం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. ఏటా అమ్మవారికి దసరా ఉత్సవాలకు పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో కనకదుర్గమ్మ ఆలయ అధికారులకు పట్టువస్త్రాలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్, చైర్మన్ మణినాయుడు అందజేశారు. వీరికి కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ బుర్రా రాధాకృష్ణగాంధీ, ఈవో వీకేసీ నాయక్‌లు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. వరసిద్ధుడి ఆలయ స్థానాచార్యులు ఫణీంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కట్టమంచి చెరువు'పై ఎన్జీటీ చెన్నై బెంచ్‌లో కేసు దాఖలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కట్టమంచి చెరువులో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ఆరోపిస్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై బెంచ్‌లో గురువారం కేసు దాఖలైంది. ఎన్జీటీలో దీనికి సంబంధించిన పిటిషన్‌ను తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం కళత్తూరుకు చెందిన న్యాయవాది విజయ్ కిరణ్ వేశారు. ప్రతివాదులుగా ఏపీ ముఖ్యకార్యదర్శి, పర్యావరణ శాఖ కార్యదర్శి, చిత్తూరు కలెక్టర్, చిత్తూరు అర్బన్ తహసీల్దార్, చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిని పేర్కొన్నారు.

రేపు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహిస్తున్నట్లు వికలాంగుల శాఖ ఏడీ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బధిరుల సంఘ నేతలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ, బ్యాంకు ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందనే విషయాన్ని తమ అధికారులకు తెలియజేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

త్వరలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా త్వరలో ప్రవేశపెడుతున్న నర్వ్ సెంటర్లలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసేవలు ఉచితంగా అందిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. చిత్తూరు, నగరి, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో డిజిటల్ నర్వ్ సెంటర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులకు శస్త్రచికిత్సలు, ఫాలోఅప్ చికిత్స, టెలీకన్సల్టేషన్ ద్వారా గ్రామీణ ప్రజలకు ఫోన్‌చేసి చికిత్సలు అందిస్తామన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, ప్రోగ్రామ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పలు పురుగు మందుల నిషేధం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి వాడే పలు పురుగు మందులను ప్రభుత్వం నిషేధించినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ భవానిపురంలోని ట్రైకాం ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తయారు చేసిన ప్రొఫెనోఫోస్ 40 శాతం, సైపర్ మెత్రిన్ ఈసీ బ్యాచ్ నెం.2401 పీసీ11 కలిగిన పురుగు మందు ప్రభుత్వ ప్రమాణిక పరీక్షల్లో నిర్ధారిత ప్రమాణాలు లేవని తేలిందన్నారు. ఈ మందులను ప్రభుత్వం నిషేధించిన కారణంగా రైతులు వ్యవసాయంలో వీటిని వినియోగించరాదని తెలిపారు.

రేపు ప్రపంచ రేబిస్ డే

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) జిల్లా పశుసంవర్థక శాఖ ద్వారా ఆదివారం ప్రపంచ రేబిస్ డేని నిర్వహించనున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ ఉమామహేశ్వరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పశువైద్య ఆస్పత్రుల్లో, డిస్పెన్సరీల ద్వారా రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించంతోపాటు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుపోషకులు, ప్రజలు వ్యాక్సినేషన్ శిబిరాల్లో తప్పక పాల్గొనాలని కోరారు.

ఆదాయ పన్ను చెల్లింపులో అలసత్వం వద్దు

ఐటీవో కేవీ రమణారావు



సమావేశంలో ప్రసంగిస్తున్న కేవీ రమణారావు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను చెల్లింపులో అలసత్వం ఉండకూడదని జిల్లా ఇన్‌కమ్‌టాక్స్ అధికారి (ఐటీవో) కేవీ రమణారావు సూచించారు. శుక్రవారం చిత్తూరులోని ఓ ఫంక్షన్ హాలులో ఇన్‌కమ్‌టాక్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చాలామంది ఆదాయం ఉన్నప్పటికీ ఇన్‌కమ్‌టాక్స్ అంటేనే భయపడుతూ ఫైల్ చేయడం లేదన్నారు. దీంతో వారి పిల్లలు చదువుకు విదేశాలకు వెళ్లేటప్పుడు ఇన్‌కమ్‌టాక్స్ ఉండాలని చెప్పడంతో కిందామీద పడుతున్నారన్నారు. మరికొంత మంది వ్యాపారులు రెండు, మూడు పాన్‌కార్డులు ఉపయోగిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని గుర్తించామన్నారు. అది చాలా పెద్ద నేరమని హెచ్చరించారు. ఎలాంటి అనుమానాలున్నా తమను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, కార్యాలయ సూపర్వైజర్ అశోక్, ఆడిటర్లు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రాల్లో బాలల ఆరోగ్యాన్ని పరీక్షించండి: జేసీ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న తొమ్మిది సంరక్షణ కేంద్రాల్లో ఉన్న బాలల ఆరోగ్యాన్ని వారానికి ఒకసారి పరీక్షించాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ సమావేశపు హాలులో బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ కమిటీ సభ్యులతో సమీక్షించారు. కమిటీ సభ్యులు కేంద్రాలను తనిఖీ చేయాలని చెప్పారు. ఒక డాక్టర్, ఒక మహిళతో కలిసి ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనధికారికంగా కొనసాగుతున్న బాలల సంరక్షణ సంస్థలను పోలీసు, రెవెన్యూశాఖల సహకారంతో గుర్తించి, చట్టపర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ నిర్మల, సంరక్షణ అధికారి రాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నత్తనడకన సొసైటీల ఆడిట్

పూర్తయ్యింది 15 సంఘాల్లోనే..



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(సొసైటీల్)ల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నత్తనడకన సాగుతోంది. 37 సొసైటీలకుగాను ఇప్పటివరకు కేవలం 15 సంఘాల్లో మాత్రమే ఆడిట్ పూర్తయ్యింది. ఈ కారణంగా రాష్ట్రంలో మన జిల్లా 15వ స్థానంలో ఉంది. నిబంధనల ప్రకారం ఆడిట్ ప్రక్రియ ఈనెలాఖరుకు పూర్తి కావాలి. ఇంకా 22 సొసైటీల ఆడిట్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆడిటర్లందరినీ రప్పించి.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో వారం రోజులుగా ఆడిట్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో 13 మంది సహకార ఆడిటర్లు మాత్రమే ఉండగా, మరో 24 మంది చార్టెర్డ్ అకౌంటెంట్లను పిలిచి ఆడిట్ చేస్తున్నారు.

కంప్యూటరీకరణలో జాప్యమే కారణం

సొసైటీల కంప్యూటరీకరణలో చోటుచేసుకున్న జాప్యమే ఆడిట్ ప్రక్రియ మందకొడిగా సాగడానికి కారణమైంది. కాన్కరెంట్, ఫైనల్ పేరుతో సొసైటీల్లో ప్రస్తుతం రెండురకాల ఆడిట్ నిర్వహిస్తున్నారు. గతంలో ఫైనల్ ఆడిట్ మాత్రమే చేసేవారు. సొసైటీ రోజువారీ లావాదేవీల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు చెక్‌చేసేందుకు కాన్కరెంట్ ఆడిట్‌ను ప్రవేశపెట్టారు. రోజువారీ లావాదేవీలను కాన్కరెంట్ ఆడిట్‌లో పరిశీలిస్తే.. ఆర్థిక సంవత్సరం ముగిశాక లావాదేవీలన్నింటిపై ఫైనల్ ఆడిట్ చేసి.. లాభనష్టాల నివేదికలు, ఆడిట్ సర్టిఫికెట్లు జారీచేస్తారు. అన్ని సొసైటీల ఆడిట్ ఈనెలాఖరులోగా పూర్తిచేస్తామని డీసీఏవో నారాయణమ్మ తెలిపారు.

మిస్బా కుటుంబానికి చేయూత

సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు బాధిత కుటుంబీకుల కృతజ్ఞతలు



సుహేల్‌బాషాతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మిస్బా తల్లిదండ్రులు - యువగళం పాదయాత్రలో లోకేశ్‌ను కలిసిన మిస్బా తల్లిదండ్రులు (ఫైల్ ఫొటో)



పుంగనూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత కారణంగా ఆత్మహత్య చేసుకున్న మిస్బా కుటుంబానికి సీఎం చంద్రబాబు చేయూతనిచ్చారు. శుక్రవారం పుంగనూరులో టీడీపీ మైనార్టీ నాయకుడు ఎస్.సుహేల్‌బాషాతో కలిసి మిస్బా తల్లిదండ్రులు నసీమా, వజీర్ మీడియాకు వివరాలు తెలిపారు. పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో మిస్బా పదో తరగతిలో తరచూ క్లాస్ ఫస్ట్ వచ్చేది. అయితే తన కుమార్తె కాకుండా మిస్బా.. ఫస్ట్ రావడాన్ని స్థానిక వైసీపీ నేత ఒకరు భరించలేకపోయారు. ఆయన చేసిన అవమానాలతో 2022 మార్చి 22వ తేదీన మిస్బా ఆత్మహత్య చేసుకుంది. యువగళం పాదయాత్రలో భాగంగా కల్లూరుకు వచ్చిన నారా లోకేశ్ దృష్టికి ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, సుహేల్‌బాషా తీసుకెళ్లారు. మిస్బా తల్లిదండ్రులతోనూ మాట్లాడించారు. టీడీపీ అధికారంలోకి రాగానే బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్న మాట ప్రకారం ఏడాది కిందట రూ.లక్ష ఖర్చులకు చల్లా రామచంద్రారెడ్డి ద్వారా అందజేశారు. పలమనేరులో ప్రాణహాని ఉందని మిస్బా కుటుంబం చెబితే సుహేల్ ద్వారా పుంగనూరులో కాపురం పెట్టించారు. ఈనెల 18వ తేదీన మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సుహేల్‌బాషాలు తమ సొంత ఖర్చులతో మిస్బా తల్లిదండ్రులను అమరావతికి తీసుకెళ్లి సీఎంతో మాట్లాడించారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయగా, చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. వెంటనే రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి, పుంగనూరులో ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేశారు అని మిస్బా తల్లిదండ్రులు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. జీవితాంతం టీడీపీకి రుణపడి ఉంటామన్నారు.

'వ్యవసాయ' చెక్‌పోస్టులపై నిఘా పెంపు

మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులపై నిఘా పెంచనున్నట్లు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) రామాంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన ఏడీ కార్యాలయంలో మార్కెట్ కమిటీల కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్షించారు. వార్షిక లక్ష్య సాధనపై దృష్టిపెట్టాలని సూచించారు. రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడారు. చెక్‌పోస్టుల్లో అవకతవకలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి 11 కో-ఆపరేటివ్ బిల్డింగ్‌లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, వాటిని వచ్చే నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. చిత్తూరులో పెండింగ్‌లో ఉన్న మార్కెట్ యార్డు నిర్మాణాలు పూర్తి చేసేందుకు రెండు దశల్లో రూ.14 కోట్లు కావాలంటూ ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. జిల్లాలో ఇటీవల మామిడి, టమోటా బహిరంగ మార్కెట్‌కు రావడం.. దళారుల వ్యవస్థతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడినట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో ర్యాంపుల యాజమాన్యాలతో పాటు టమోటా మధ్యవర్తులపై అంశాన్ని నోటీపై చేసి, మార్కెటింగ్ శాఖ పరిధిలోకి తీసుకురాన్నట్లు స్పష్టం చేశారు. ఇది రైతులకు లాభసాటిగా ఉండటమే కాకుండా ప్రభుత్వానికీ ఆదాయం వస్తుందని తెలియజేశారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్, తిరుపతి డిస్ట్రిక్ అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి సురేంద్ర, డీఈ వినోద్ పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం

సదరన్ డిస్కం సీజీఎం సురేంద్ర నాయుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న సురేంద్ర నాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని సదరన్ డిస్కం సీజీఎం సురేంద్రనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 220 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. ఈ సబ్‌స్టేషన్‌లో సమస్యలు తలెత్తితే జిల్లా అంతటా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అందువల్ల అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడానికి జిల్లాలో రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జీడీనెల్లూరులోని ఆముదాలవలస వద్ద ఓ సబ్‌స్టేషన్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. మరొకటి దొడ్డిపల్లె పరిసరాల్లో ఏర్పాటుకు ఐదెకరాల స్థలం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. జిల్లాలోని 234 సబ్‌స్టేషన్లను పక్కాగా మెయింటెన్ చేసుకోవాలన్నారు. ఒక నెలలో అన్ని సబ్‌స్టేషన్లను తాను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. లోడ్‌నుబట్టి ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సూర్యఘర్ పథకంపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఏఈ 100 సర్వీసులు టార్గెట్‌గా పెట్టుకుని పనిచేయాలని ఆదేశాలిచ్చారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలిచి నిర్మాణం ప్రారంభిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ సురేష్, డీఈలు ఆనంద్, ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

'జీఎస్టీ' ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ అంశంపై కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ జాయింట్ కమిషనర్ రఘునాథరెడ్డి, డిప్యూటీ కమిషనరు పరదేశి నాయుడు పాల్గొన్నారు.

'సీమ'లో ఒకే ఒక్కడు


● కామర్స్ పీజీటీ పోస్టు దక్కించుకున్న గిన్నె రవిశంకర్



గిన్నె రవిశంకర్

డీఎస్సీలో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రానికంతా ఉన్నదే నాలుగు. అందులో రాయలసీమ జోన్-4 ప్రాంతంలో ఉన్నది ఒక పోస్టే. ఈ నాలుగు పోస్టులకు పోటీ పడింది 354 మంది. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఒక పోస్టును దక్కించుకున్నారు తిరుపతికి చెందిన గిన్నె రవిశంకర్. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాల ఇన్‌స్ట్రక్టర్ గిన్నె సాగర్, అలివేలు కుమారుడు, పూలవానిగుంటకు చెందిన రవిశంకర్.. ఎస్వీయూలో ఎంకాం చదివారు. ఆ తర్వాత బీఈడీ చేశారు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్‌లో పీజీటీ (అకౌంటెన్సీ)గా పనిచేస్తున్నారు. మెగా డీఎస్సీలో ఆదర్శ పాఠశాలల్లో కామర్స్ పీజీటీ పోస్టులు రాష్ట్రంలో నాలుగంటే నాలుగు ఖాళీగా ఉన్నాయి. పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో సాధన ప్రారంభించారు. 62.05 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో.. రాయలసీమజోన్ స్థాయిలో ఒకటో స్థానంలో నిలిచారు. ఇలా రాయలసీమ జోన్‌లో ఉన్న ఒకేఒక్క పోస్టును కైవసం చేసుకున్నారాయన. 'మెగా డీఎస్సీలాంటి బంగారు అవకాశాన్ని వదులుకోకూడదని భావించా. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని రోజుకు 6 నుంచి 8 గంటలు చదివా. రాష్ట్రంలోని నాలుగు పోస్టుల్లో ఒకటి సాధించడం చాలా ఆనందంగా ఉంది' అని రవిశంకర్ పేర్కొన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



దేవుడ్ని చూడగానే కళ్లల్లో నీళ్లొచ్చాయి

బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్

'దేవుడ్ని చూడగానే కళ్లలోంచి నీళ్లు తన్నుకుని వచ్చాయి. గొప్ప సంతోషంతో మనసు నిండిపోయింది. అదొక దివ్యానుభూతి' అని తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనం తర్వాత బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అన్నారు. శుక్రవారం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, స్వామిని చూసి బయటకు వచ్చిన తర్వాత మనసు మొత్తం దేవుడి ప్రేమ, రూపం నిండిపోయాయన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేసిన అలంకరణలు చాలా బాగున్నాయన్నారు. కాగా, అంతకుముందు సినీనటి వాసుకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



స్వాగత ఆర్చి నమూనా చిత్రం

స్వర్ణ కుప్పానికి స్వాగత ద్వారం



స్వాగత ఆర్చి పనులు ప్రారంభించి, నమూనా చిత్రాన్ని చూపుతున్న కడా పీడీ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ కుప్పానికి స్వాగత ద్వారం సిద్ధమవుతోంది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో స్వాగత ఆర్చి నిర్మాణానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. 'వెల్కమ్ టూ స్వర్ణ కుప్పం' అక్షరాలతో నిర్మాణం కాబోతున్న ఈ స్వాగత ఆర్చి అంచనా వ్యయం రూ.58 లక్షలు. ప్రత్యేక నిధులనుంచి కేటాయించిన ఈ నిధులతో ఆర్చిని నిర్మించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. సమీప భవిష్యత్తులోనే అనేక అభివృద్ధి పనులు సాకారమై కట్టెదుట స్వర్ణ కుప్పం సాక్షాత్కరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు సోము, సురేశ్, టీడీపీ నాయకుడు గోపీనాథ్, నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నాయకులు రవి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలపండి

● సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్ థామస్ విజ్ఞప్తి



వెదురుకుప్పం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో చంద్రబాబును ఎమ్మెల్యే థామస్ కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి సంబంధిత అంశాలను ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కార్వేటినగరం నుంచి పచ్చికాపలం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, పచ్చికాపలం నుంచి కొత్తపల్లిమిట్ట వయా వెదురుకుప్పం వరకు డబుల్ రోడ్డు ప్రతిపాదన, వెదురుకుప్పం ప్రభుత్వ ఐటీఐ భవన నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఈ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హింసలేని కుటుంబాలే లక్ష్యంగా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో క్షేత్రస్థాయి సిబ్బంది, మండల, జిల్లా సమాఖ్య ప్రతినిధులతో జెండర్ కార్యక్రమాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. వైద్యశాఖ అధికారి వాణి మహిళల ఆరోగ్య సంరక్షణ అంశాలను వివరించారు. కార్యక్రమంలో వయోజన విద్య డీడీ మహమ్మద్ ఆజాద్, డీపీఎం మంజుల, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ప్రభుత్వం



చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు

కుప్పం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపాలిటీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో 'లోక్ కళ్యాణ్ మేళా' నిర్వహించారు. పలు బ్యాంకర్లు పాల్గొన్న ఈ సమావేశంలో కుప్పం పట్టణ పరిధిలోని వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు, టీడీపీ నాయకుడు గోపీనాథ్, కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, కౌన్సిలర్లు జిమ్ దాము, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, రెస్కో డైరెక్టర్ శివ, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, డీకేపల్లె యూనిట్ కో ఇన్‌చార్జి వేలు, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే జనసేనలో స్థానం లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో జనసేన పార్టీలో స్థానం ఉండదని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ తెలిపారు. కుప్పం నుంచి తమిళనాడు కృష్ణగిరి మీదుగా మదురైకి కారులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కేసులో కుప్పం జనసేన పార్టీకి చెందినట్లు చెబుతున్న హరికృష్ణను తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో కుప్పంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చట్టవిరుద్ధమైన పనులను సహించబోరన్నారు. జనసేన పార్టీ నైతిక విలువలు, క్రమశిక్షణ, చట్టపరమైన గౌరవం విషయంలో ఎప్పుడూ రాజీ పడబోదన్నారు. తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తిని ఇకపై పార్టీ కార్యకలాపాల్లో పాల్గొననివ్వమని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన



ఎమ్మార్సీ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎంఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. పలమనేరులో ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు దసరా సెలవులు 22 నుంచి ప్రారంభమైనప్పటికీ నేటికీ తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సెలవుల్లో సైతం తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి దసరా సెలవులు ముగిసే వరకు ప్రతి ఒక్క విద్యాసంస్థ సెలవులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షులు బి.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు సంజయ్, పలమనేరు నియోజకవర్గ కార్యదర్శి రిషి, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమారాణి

పలమనేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాలింతలు, గర్భిణులు స్థానికంగా దొరికే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని పలమనేరు సీడీపీవో ఉమారాణి అన్నారు. శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పలమనేరు మండలం మొరం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమారాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు పౌష్టికాహార ఆవశ్యకతను అంగన్‌వాడీ కార్యకర్తలు తెలియజేయాలని సూచించారు. సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు రేవతి, కాంతమ్మ, రెడ్డెమ్మ, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

ఊరూరా దసరా ఉత్సవాల సందడి

ప్రత్యేకాలంకరణల్లో దేవతామూర్తుల దర్శనం



వి.కోట దుర్గమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు



రామకుప్పం: కంబాలదేవులపల్లెలో పూజలందుకున్న సప్తమాతృక చౌడేశ్వరమ్మ



అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకుంటున్న బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కే వెంకటరమణారెడ్డి



చౌడేపల్లె : ఉభయదారులచే హోమం, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చౌడేపల్లె: ప్రత్యేకాలంకరణలో మూలస్థానం అమ్మవారు

పుంగనూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిసర ప్రాంతాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పుంగనూరు మండలం చదళ్లలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి, ఉషశ్రీ దంపతులచే అష్టలక్ష్మి దేవతలకు పూజలు చేశారు. కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో శ్రీవారు త్రివిక్రమావతారంలో దర్శనమిచ్చారు. విరూపాక్షి మారెమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరి పూజలు అందుకున్నారు.

● **చౌడేపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవాలలో 4వ రోజు అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీ బోయకొండ చైర్మన్ ఎస్కే వెంకటరమణరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం మోహినీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, సహస్ర నామార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. ఉభయదారులుగా చెంగల్రాయశెట్టి, యర్రయ్యశెట్టి, ప్రభాకర్‌శెట్టి, సత్యనారాయణశెట్టి, నరసింహులుశెట్టి, మోహన్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. దసరా ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● **సోమల:** మండలంలోని పత్రపల్లె ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకరణ, కందూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమల బోయకొండ గంగమ్మ, కందూరు పాలేటమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అభిషేక పూజలు చేపట్టారు.

● **సదుం:** జాండ్రపేటలో వెలసిన రామలింగ చౌడేశ్వరి దేవి శుక్రవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్.పెంచలయ్య, అంజనమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే రాజులు, ఆచారిల ఆధ్వర్యంలో సదుం గ్రామ దేవత సదుమమ్మ గరుడ వాహనంపై నారాయణ అలంకరణలో దర్శనమిచ్చారు.

● **రామకుప్పం:** రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు.

● **వి.కోట:** వి.కోటలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● **గంగవరం:** మేలుమాయి క్రాస్‌లో వెలసిన మలాలమ్మ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేపట్టారు.



సోమల: పత్రపల్లెలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ




కల్లూరు : మోహినీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



సదుం: ధనలక్ష్మిగా రామలింగ చౌడేశ్వరి



పుంగనూరు: ధనలక్ష్మిగా చదళ్ల చౌడేశ్వరీదేవి



లలితాత్రిపురసుందరిదేవి అలంకరణలో మారెమ్మ



గంగవరం: మహాలక్ష్మి అలంకారంలో మలాలమ్మ

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



తిమ్మసముద్రంలో పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ

రామకుప్పం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన మరుసటిరోజు నుంచే గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు సమకూరుతున్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం తిమ్మసముద్రం కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తారురోడ్ల పునర్నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు పద్మమ్మ, వాల్మీకి సాధికార సమితి నేత మురళీ, నేతలు గుర్రప్ప, శ్రీనివాసులు, సుబ్బయ్య, బాలరాజు, గణేష్‌నాయుడు, అల్లీశీన తదితరులు పాల్గొన్నారు.

29న పుంగనూరు మున్సిపల్ సమావేశం

పుంగనూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎస్.అలీంబాషా అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగే మున్సిపల్ మీట్‌కు కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సిమెంట్ వ్యాపారి అదృశ్యం



భాస్కర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

పలమనేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం నక్కపల్లి గ్రామానికి చెందిన సిమెంట్, పైపుల వ్యాపారి భాస్కర్‌రెడ్డి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారంలో దాదాపు రూ. 80 లక్షలకు పైగా అప్పులు చేసి చివరకు తనకున్న పొలాన్ని విక్రయించి అప్పులు తీర్చేందుకు కుటుంబ సభ్యులను భాస్కర్‌రెడ్డి ఒప్పించాడు. పొలం విక్రయానికి స్టాంపు పేపర్లు తీసుకొచ్చేందుకు గురువారం వెళ్తున్నట్లు ఇంటి నుంచి వచ్చిన భాస్కర్‌రెడ్డి ఇంటికి చేరక పోవడంతో కుటుంబసభ్యులు విచారించారు. భాస్కర్‌రెడ్డి భార్య సంధ్య పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారిస్తున్నారు.

రేపు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



మాట్లాడుతున్న మాలమహానాడు నాయకుడు అశోక్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న మదనపల్లెలో జరిగే రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ విజయవంతం చేసి రాజ్యాంగ రక్షణకు చేయూతనివ్వాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, పెరిగిన జనాభా మేరకు రిజర్వేషన్లు పెంచాలని, దళితులపై జరుగుతున్న దాడులుపై పరిష్కరించే విధానాలు అమలుచేయాలని డిమాండు చేశారు.సమస్యలపై ఉద్యమిస్తూ చేపట్టనున్న పాదయాత్ర ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

మహిళా సంఘాల నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలి



అధికారులను ప్రశ్నిస్తున్న దళిత నాయకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం లో మహిళా సం ఘాల్లోని నిధు ల గోల్‌మాల్‌పై అధికారుల విచారణ చేపట్టాలని దళిత సంఘ నేతలు డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ జే.రాము అధ్యక్షతన జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో దళిత సంఘ నేతలు వెంకటరమణ, శ్రీనివాసులు మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది సక్రమంగా చెల్లించినా సంఘమిత్రల చేతివాటంతో నిధులు కాజేసినా వీటిని పర్యవేక్షించాల్సిన సీసీలు, ఏపీఎం పట్టించుకోకపోవడంతో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపించారు. మంగళంలో రూ.20 లక్షలు, సింగిరిగుంటలో రూ.30 లక్షలు నిధులు స్వాహా అయినట్లు ఆధారాలున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, సీఐ సుబ్బరాయుడు, నేతలు అశోక్‌కుమార్, నరసింహులు, చిన్నబ్బ, రాజన్న వివిధ శాఖల అధికారులు, ఈవోపీఆర్డీ నారాయణ, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

సోమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్ ఆవరణలో ఈనెల 28న ఆదివారం షిరిడి సాయిబాబా ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు పీఎస్. నాగరాజ తెలిపారు. మదనపల్లె రమా కంటి వైద్యశాల నిపుణులచే కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌కు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

సోమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాదయాత్రగా వెళుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమల, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లె, రాశెట్టివారిపల్లె, వడ్డిపల్లె గ్రామాల నుంచి తిరుమలకు తరలి వెళ్లారు.

ప్రమాదకరంగా రాతిబండలు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా వేసిన రాతిబండలు

రామకుప్పం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారి పక్కన ఉన్న రాతి బండలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలకు ఉన్న పాత ప్రహరీ ఎత్తు పెంచే పనులు సాగుతున్నాయి. పాఠశాల లోపల ఉన్న రాతిబండలు దూరంగా తరలించకుండా కాంట్రాక్టరు ప్రహరీకి ఆనుకొని రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారి పక్కన పడేశారు. ఆ రాతిబండలు రోడ్డుపక్కనే ఉండటంతోపాటు పలు బండలను రోడ్డుపైకి పడేశారు. అక్కడ రోడ్డు మలుపుగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి రాతిబండలను దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పొలంలో జారిపడి రైతు మృతి



వేలు (ఫైల్ ఫొటో)

గుడుపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలకు నీరు అందించేందుకు వ్యవసాయ పొలానికి వెళ్లి ఎత్తు నుంచి జారి రాతి బండపై పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం గుడుపల్లె మండలంలో జరిగింది. కంచిబందార్లపల్లె చెందిన వేలు(43) తన వ్యవసాయ పొలం వద్దకు మధ్యాహ్నం నీరు అందించడానికి వెళ్లాడు. తన పొలంలో ఎత్తున ఉన్న ప్రదేశం నుంచి కింద ఉన్న రాతి బండపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. భర్త ఇంటికి రాకపోవడంతో వేలు భార్య ప్రమీళ పొలం వద్దకు వెళ్లింది. తీవ్ర గాయాలతో తన భర్త ఉండటాన్ని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పుంగనూరులో చోరీ

పుంగనూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు బజారువీధిలోని ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి ఇంటి తాళాలు కొట్టి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు, వెండి, నగదు చోరీకి పాల్పడినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక బజారువీధికి చెందిన బోజనాల రాధాకృష్ణయ్యశెట్టి కుటుంబ సభ్యులు ఆలయానికి వెళ్లి ఇంటికి రాగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. 140 గ్రాముల బంగారు, రెండు కిలోల వెండి, నగదు రూ. 35 వేలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బరాయుడు, సిబ్బంది చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి భరోసా



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్‌వి.రమణారెడ్డి అన్నారు. శుక్రవారం పలమనేరు కాకాతోపు అర్బన్ ఆరోగ్యకేంద్రంలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేఖ మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం కోసం కార్యక్రమంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 30 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని.. స్వీయ పరీక్ష చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ దేవరాజులు, హెచ్‌డీఎస్ చైర్మన్ నాగరాజు, కౌన్సిలర్లు కిరణ్, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, టీడీపీ నాయకులు ఖాజాపీర్, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **సోమల:** గ్రామీణ మహిళలు ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు వైద్యసేవలు పొందాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హరిత తెలిపారు. శుక్రవారం ఆవులపల్లెలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్యపరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచి కోదండరాజు, వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, ఆరోగ్యవిస్తరణాధికారి ఉదయభాస్కర్, సురేంద్రరెడ్డి, చంద్రమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● **కల్లూరు:** ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు నరేంద్రచౌదరి, గోవిందయ్య, రవీంద్రారెడి, యల్లారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కమ్మపల్లిలో శుక్రవారం పులిచెర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. వైద్య శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, క్షయ, క్యాన్సర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. మహిళలందరూ వైద్య పరీక్షలు జరుపుకోవాలని, నాయకులు గిరిధర్‌నాయుడు, జగన్నాధరెడ్డి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

● **రామకుప్పం:** విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 110 మంది రోగులకు వైద్యసేవలందించారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, హెల్త్ అసిస్టెంట్ బాలు, నేతలు సత్తి, ఎర్రప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



కల్లూరు : కమ్మపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు నరేంద్రచౌదరి



సోమల : ఆవులపల్లెలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హరిత

అమ్మవారి సేవలో ఎంపీ దగ్గుమళ్ల


ఎంపీ దగ్గుమళ్ల, సీఆర్ రాజన్‌కు పూర్ణకుంభ స్వాగతం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలోని గంగమ్మగుడి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ పాల్గొని ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ సంప్రదాయ ప్రకారం అర్చకులు ఎంపీ దగ్గుమళ్లకు, సి.ఆర్.రాజన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శాలువ కప్పి సన్మానించి, తీర్థప్రసాదాలు అందించారు. టీడీపీ నాయకులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, కృష్ణమ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, జలంధర్ నాయుడు, సిద్దయ్యశెట్టి, జయచంద్ర నాయుడు, హేమాద్రి యాదవ్, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలి

● అఖిలపక్షం నాయకుల నిరసన


కార్వేటినగరంలో నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలంటూ శుక్రవారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో అఖిలపక్షం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్వేటినగరం పోలీసు స్టేషన్ నుంచి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వరకు నాయకులు నిరసన ర్యాలీ చేశారు. తెలుగు యువత నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటకృష్ణయాదవ్, ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ, కార్వేటినగరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు జగన్నాథం, వైసీపీ అధ్యక్షుడు శివప్రకాష్, పి.ప్రసాద్‌రెడ్డి, జయరాం, రాజేష్, సాయిశివరాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే థామస్‌ని కలసిన తెలుగు తమ్ముళ్లు

వెదురుకుప్పం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌ని శుక్రవారం విజయవాడలో వెదురుకుప్పం, కార్వేటినగరం తెలుగుదేశం పార్టీ నాయకులు కలిశారు. పీఏసీఎస్ ఛైర్మన్లు జనార్ధన్‌రాజు, సుధాకర్‌రెడ్డి, నాయకులు మురళీమోహన్ కలసిన వారిలో ఉన్నారు.

ఎస్పీని కలసిన టీడీపీ నేతలు



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ తుషార్ డూడిని టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు రాజశేఖర్, కంద, జయచంద్ర నాయుడు, సురేంద్ర నాయుడు, బాలాజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూమి స్వాధీనం


ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న చిత్తూరు రూరల్ తహసీల్దార్ జయప్రకాష్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో 11వ డివిజన్ పరిధిలోని చెరువు ముందర ఊరులోని సర్వే నెంబరు 2లోని ప్రభుత్వ భూమిని అదే డివిజన్‌కు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి కొబ్బరి చెట్లు నాటారని కలెక్టరుకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై చిత్తూరు రూరల్ మండల తహసీల్దార్ జయప్రకాష్‌ను విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి వెళ్లి సర్వే నిర్వహించారు. కొబ్బరి చెట్లు నాటిన భూమి ప్రభుత్వ స్థలమని గుర్తించి, చెట్లను తొలగించినట్లు ఆయన తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు ఆయన వివరించారు.

కాత్యాయనీదేవిగా
దుర్గాంబ


చిత్తూరు: దుర్గమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన | కుళందేశ్వర ఆలయంలో ధనలక్ష్మిగా అమ్మవారు | కోదండరామాలయంలో వరాహస్వామి | ఆంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మి | ఐరాల: లలితా త్రిపుర సుందరిగా మరగదాంబిక | పాలసముద్రం: దుర్గా పార్వతిగా గంగమ్మ


కార్వేటినగరం: మహాలక్ష్మిగా నైనేరమ్మ | వెదురుకుప్పం: మహాలక్ష్మిగా రాజరాజేశ్వరిదేవి | నింద్ర: ధనలక్ష్మిగా మహాలక్ష్మి | నగరి: స్కంధమాతగా అన్నపూర్ణేశ్వరీదేవి | గంగాధరనెల్లూరు: మీనాక్షిగా అల్లియెల్లమ్మ | బంగారుపాళ్యం: అన్నపూర్ణాదేవిగా ముత్యాలమ్మ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల్లో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. నగరంలోని గిరింపేటలో వెలసిన దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం కాత్యాయనీదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కట్టమంచి కుళందేశ్వర ఆలయంలో ధనలక్ష్మి అలంకారంలో, సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో లలితా దేవిగా, వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు వేంకటేశ్వరుడిగా, కోదండరామస్వామి ఆలయంలో వరాహ స్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొంగారెడ్డిపల్లెలోని అంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మీగా, తేనెబండలోని ముత్యాలమ్మ పార్వతీదేవిగా, మురకంబట్టు ఇందిరమ్మ కాలనీలో ప్రత్యేక పసుపు అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

● ఐరాల(కాణిపాకం): కాణిపాక క్షేత్రంలో వెలసిన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ● వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారుగా గుత్తి బొబ్బిలి, ప్రమీల దంపతులు వ్యవహరించారు. ● వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్‌కండ్రిగలోని కొండమల్లీశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరిదేవి అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ● పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో వెలసిన చెవిటిగంగమ్మ అమ్మవారు దుర్గాపార్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ● నింద్ర: నింద్ర మండలం కూనమరాజుపాళెంలో కొలువైన మహాలక్ష్మీ అమ్మవారు ధనలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చారు. ఏర్పాట్లను గీతాశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానందస్వామి పర్యవేక్షించారు. ● నగరి: స్థానిక నేత్ర ప్రదాయని దేశమ్మ దేవత మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరకంఠేశ్వర ఆలయంలో కామాక్షిదేవికి కౌమారి అలంకరణ చేయగా, భక్తులు కుంకుమ పూజ చేశారు. బుగ్గకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి స్కంధమాతగా దర్శనమిచ్చారు. ఓంశక్తి ఆలయంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. సామాలమ్మను గాజుల మాలతో అలంకరించారు. ● గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు గ్రామంలోని అల్లియెల్లమ్మ మీనాక్షిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ● బంగారుపాళ్యం: బంగారుపాళ్యం గ్రామదేవత ముత్యాలమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ● విజయపురం: మండలంలోని విజయపురం మిట్టూరులో మహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ దర్శనమిచ్చారు.

నడిరోడ్డుపై కారు బోల్తా

● ఐదుగురికి స్వల్పగాయాలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎట్టేరి గ్రామ సమీపంలో శుక్రవారం నడిరోడ్డుపై ఓ కారుబోల్తా పడ్డ సంఘటనలో ఐదుగురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం హోసూరుకు చెందిన రమేష్ కుటుంబసభ్యులతో కలిసి గంగాధరనెల్లూరు మీదుగా పుత్తూరుకు కారులో వెళుతుండగా కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామ సమీపంలోని భానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద కుక్కను తప్పించబోయి పక్కకు మళ్లించారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి పక్కనున్న చెట్టును ఢీకొని నడిరోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రమేష్‌తో పాటు నలుగురు కుటుంబసభ్యులు స్వల్పగాయపడ్డారు. వెంటనే వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని గంగాధరనెల్లూరు పోలీసులు తెలిపారు.

క్వారీ వ్యాపారి ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ క్వారీ వ్యాపారి శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చిత్తూరు నగరానికి చెందిన శేఖర్‌బాబు క్వారీ వ్యాపారాలు చేస్తుంటారు. వ్యాపారాల్లో అప్పులు ఎక్కువకావడంతో ఆయన శుక్రవారం సిద్ధంపల్లి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు ఆయన్ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెనుమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాళ్యంకొత్తూరు పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై ఎస్ఐ నరసింహం తమ సిబ్బందితో శుక్రవారం దాడులు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్త సేకరణలో జాప్యం వద్దు

పెనుమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణలో వెనుకబడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పులికల్లు, ఉగ్రాణంపల్లి పంచాయతీలో చెత్త సేకరణను పరిశీలించారు. గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ఇంట్లోనుంచి వ్యాపిస్తున్న పొగ

బంగారుపాళ్యం,సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలోని ఓటీకే వీధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... బంగారుపాళ్యంకు చెందిన వినాయకా టైక్స్ టైల్ యాజమాని గొల్లపల్లెకు వెళ్లే దారిలో తన ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఎప్పటిలానే దుకాణానికి కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో కిటికీల నుంచి పొగరావడాన్ని చూసి ఆ దారిన వెళ్లేవారు వారికి సమాచారం ఇచ్చారు. దీంతో స్థానికుల సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఇంటిలోని ఫర్నిచర్, బట్టలు, సామానులు మొత్తం కాలిబూడిదయ్యాయి.

రేపు చిత్తూరు టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చిత్తూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు జనరల్ బాడీ సమావేశం ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు స్థానిక గిరింపేట బ్రాంచీలో జరుగుతుందని బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో సుమతి తెలిపారు. ఛైర్మన్ రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో బ్యాంకు పరిపాలన నివేదిక, ఆస్తి, అప్పులు, లాభనష్టాల పట్టిక, ఆదాయ, వ్యయాల ప్రతిపాదనలను ఆమోదించడం జరుగుతుందన్నారు. ఏ తరగతి సభ్యులు, షేర్ హోల్డర్లు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'భూ కబ్జాదారులకు తహసీల్దార్ అండ'

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారులకు తహసీల్దార్ అండగా ఉంటూ తమకు అన్యాయం చేస్తున్నారని యాదమరి మండలం రసూల్ నగర్ ఆదిఆంధ్రవాడకు చెందిన వీరప్ప, బుజ్జి దంపతులు ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తమకు మంజూరు చేసిన రెండెకరాల భూమిని దళవాయిపల్లెకు చెందిన కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తహసీల్దార్ పార్థసారథి కబ్జాదారులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన డీసీహెచ్ఎస్

పూతలపట్టు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పి.కొత్తకోటలోని సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సిబ్బంది ఎలా స్పందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు, సిబ్బందికి ఆమె సూచించారు.


క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వెదురుకుప్పం మండలం గంటావారిపల్లికి చెందిన సిద్దమ్మకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2,50,000 ఎల్‌వోసీ పత్రాన్ని విజయవాడలో ప్రభుత్వ విప్ థామస్ శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

గోవింద భక్తులకు అన్నదానం



నగరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన సుమారు 750 మంది గోవింద భక్తులకు నగరి పట్టణ పరిధిలోని పలువురు దాతలు శుక్రవారం అన్నదానం చేశారు. దీంతో ఓంశక్తి ఆలయ ఆవరణలతో పాటు రహదారి కూడా గోవింద భక్తులతో నిండిపోయింది. దాతలు ఆర్ముగం, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, జయచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్ కుమార్, దయానిధి, చంద్రారెడ్డి, మునికృష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి, వేలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కుప్పంలో చెన్నై ఫెర్టిలిటీ వైద్య శిబిరం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతులకు చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కుప్పం శ్రీప్రియ నర్సింగ్ హోమ్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐవీఎఫ్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్రంలో 57 ప్రత్యేక ఐవీఎఫ్ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి 7వేల మందికి పైగా సంతాన సాఫల్యతను కల్పించామన్నారు. కుప్పంలో నిర్వహించే శిబిరంలో దంపతులకు సలహాలు, సూచనలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 81796 44570, 99621 83377 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎస్పీకి సన్మానం


ఎస్పీకి శాలువకప్పి సన్మానిస్తున్న కృష్ణమ నాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ తుషార్ డూడిని శుక్రవారం చిత్తూరులో పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సింగిల్‌విండో మాజీ వైస్‌ఛైర్మన్ బొడపాటి బాబునాయుడు, పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్‌సెక్రటరీ జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు పరామర్శ

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు పంచాయతీ ద్వారాకనగరం గ్రామానికి టీడీపీ నాయకుడు కోదండరెడ్డి ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఆపార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పెనుమూరు ఏఎంసీ ఛైర్మన్ కృష్ణమ నాయుడు, బాలాజీ నాయుడు, బల్ల వెంకటేష్ నాయుడు, వెంకటాచలం, వాసు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, సూరిరెడ్డి, సిద్దయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పాలసముద్రం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వర్షా కాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ రెండేసి మొక్కలు నాటాలని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో మొక్కలు నాటించారు. అధ్యాపకులు వినాయకం, రమ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

యాదమరి సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. 'గిరిజన వికాస్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఓటివారిపల్లె ఎస్టీ కాలనీని మండల అధికారులతో కలసి సందర్శించారు. గామస్తులు మాట్లాడుతూ రేషన్ బియ్యం కోసం మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోందని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామంలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీవో పెంచల వీరేంద్ర, మండల అధికారులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి సకాలంలో టీకాలు వేయాలి

పెనుమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధికి సకాలంలో టీకాలు వేయాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని శాతంబాకంలో రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

విజయపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురంలో సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఎంపీడీవో రాజేంద్ర ఒక రోజు శిక్షణా సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన మినీలారీ


నీళ్లలో ఇరుక్కుపోయిన మినీలారీ

గుడిపాల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి చెన్నైకి వెళ్లే మార్గంలోని మండికృష్ణాపురం పంచాయతీ పెరుమాళ్లకండ్రిగ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి రెండు మినీలారీలు ఇరుక్కుపోయాయి. స్థానికులు స్పందించి జేసీబీ ద్వారా ఒక వాహనాన్ని అతికష్టంపై వెలికితీయగా, మరో వాహనాన్ని తొలగించలేకపోవడంతో అక్కడే ఇరుక్కుపోయింది. ఒక రోజంతా గడచినా సంబంధిత రైల్వే శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. శుక్రవారం అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బ్రిడ్జి దాటుతూ ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యారు. వెంటనే రైల్వేఅధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజం దళితవాడలో తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో వింజం దళితవాడకు చెందిన ఆరుగురు వ్యక్తులు డెంగ్యూ జ్వరాలతో నాలుగురోజుల క్రితం చేరినట్లు తెలిసింది. ఈసమాచారంతో ఎంపీడీవో మనోహర్‌గౌడ్ ఆదేశాలతో సర్పంచ్ రామక్క గోవిందయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ సహకారంతో దళితవాడలో పారిశుధ్య పనులు చేసి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అనంతరం ప్రజలకు రక్తపరీక్షలు చేసి, మందులు పంపిణీచేశారు. వింజం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, సగికుమార్, శ్రీరాములు, వైద్యసిబ్బందిపాల్గొన్నారు.

4 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నగరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఒక నివాసం వద్ద చిన్నచిన్న మూటలు కట్టి ఉంచిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం స్థానికంగా అందిన సమాచారం మేరకు సంబంధిత ప్రాంతానికి చేరుకున్న వారు అక్కడ నిల్వ ఉంచిన బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎవరిదన్న వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై విజయ్ నాయక్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని గోదాముకు తరలిస్తున్నట్టు డీటీ మేఘవర్ణం తెలిపారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై ఖండన

వెదురుకుప్పం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. మాజీ సీఎం జగన్‌ను కించపరిచే విధంగా బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడటం సరికాదన్నారు.